క్లుప్తంగా

నేటి నుంచి సిద్ధేశ్వర స్వామి ఉత్సవాలు



మద్దూరు: మండలంలోని నాగిరెడ్డిపల్లిలో వెలసిన సిద్దేశ్వరస్వామి ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నట్లు అయన కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 26న పూజలు, శివపార్వతుల కల్యాణం, 27న సత్యనారాయణ స్వామి వ్రతం, అన్నదానం ఉంటుందని పేర్కొన్నారు.

గౌరీశంకర బ్రహ్మోత్సవాలు

ఊట్కూరు: మండలంలోని నిడుగుర్తిలో బుధవారం నుంచి గౌరీశంకర్ బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతున్నట్లు ఆలయ ధర్మకర్త జీ బాల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. మూడు రోజుల పాటు ఈ బ్రహ్మోత్సవాలు జరుగుతాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు ఆలయంలో ప్రత్యేక పూజలు

కృష్ణా: మండలంలోని చేగుంట పార్వతి పరమేశ్వర ఆలయంలో బుధవారం మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అధిపతి క్షీరలింగ మహాస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహారాష్ట్ర, కర్ణాటక నుంచి వంద లాది మంది భక్తులు ఆలయానికి వస్తారని, వా రికి అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

శివపార్వతుల కల్యాణ మహోత్సవం



ధన్వాడ: మండల కేంద్రంలోని సాంబట్లతోట ఎన్టీఆర్ కాలనీలో మల్లికార్జున దేవాలయం శివరాత్రి సందర్భంగా బుధవారం రుద్రాభిషేకం, పల్లకీసేవ, నందికోల వీరభద్రసేవ, స్పర్శ దర్శనం, శివపార్వతుల కల్యాణం, జ్యోతి ప్రజ్వలన నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుల పటేల్ నర్సింహులు గురుస్వామి తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

మద్దూరు: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మండలంలోని పల్లెగడ్డకు చెందిన విటవోని రమేష్ ట్రాక్టర్‌లో దోరేపల్లి వాగు నుంచి అక్రమంగా ఇసుకను మద్దూరుకు తీసుకొస్తున్న క్రమంలో పోలీసులు పట్టుకొని ట్రాక్టర్ సీజ్ చేశారు. ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



మద్దూరు: మండలంలోని ఖాజీపూర్ గ్రామంలో మంగళవారం రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన కానగడ్డ జములప్ప ఇంట్లో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్లు సమాచారం రావడంతో, ఇంటిపై దాడి చేసి 12 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. దీనిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు.

లారీ, ఆటో ఢీ: విద్యార్థులకు తీవ్ర గాయాలు



దామరగిద్ద: లారీ, ఆటో ఢీకొన్న ప్రమాదంలో స్కూల్ విద్యార్థులకు తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం మండల కేంద్రం సమీపంలో చోటు చేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. మండలంలోని మద్దెల్‌బీడ్ గ్రామానికి చెందిన విద్యార్థులు ప్రతిరోజు గ్రామానికి చెందిన ఆటోలో మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు వెళ్తుంటారు. మంగళవారం సాయంత్రం పాఠశాల నుంచి ఆటోలో తిరిగి వస్తున్నారు. పెట్రోల్‌బంక్ సమీపంలో నారాయణపేట వైపు నుంచి ఎదురుగా వస్తున్న లారీ ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈశ్వక్ అనే విద్యార్థికి కాలుకు గాయమైంది. వారిని నారాయణపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. విద్యార్థులు చరణ్, కార్తిక్, సిద్దార్థలకు, డ్రైవర్ లింగప్ప తలకు బలమైన గాయాలయ్యాయి. సీటీ స్కానింగ్ కోసం మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశారు.

శంభో శివశంభో.. శివశివ శంభో..



ఆలయంలో స్వామి వారి విగ్రహం(నిలువుబొట్టుతో)

- శివరాత్రి వేడుకలకు రామలింగేశ్వరుడి ఆలయం ముస్తాబు
- వనవాసానికి వెళ్తూ శివలింగం ప్రతిష్ఠించిన శ్రీరాముడు
- ఏటా పెరుగుతున్న శివమాలధారులు

మాగనూర్: మహాశివరాత్రి పర్వదినం పండుగను పురస్కరించుకుని బుధవారం, గురువారాల్లో మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వరుడు ఆలయం మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబు అయింది. ప్రతి చోట శివరాత్రి రోజు భక్తులు శివాలయాలకు క్యూలు కడితే మండల కేంద్రంలో మాత్రం ఒకరోజు తర్వాత అంటే శివమాలధారులు శ్రీశైలం నుంచి వచ్చిన తర్వాత ఉపవాసదీక్షలు విరమణ చేసి వేడుకలు నిర్వహిస్తారు.

శ్రీరాముడు ప్రతిష్ఠించిన శివలింగం..

మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వరుడు ఆలయంలోని శివలింగాన్ని స్వయాన శ్రీరామచంద్రుడు ప్రతిష్ఠించినట్లు ఇక్కడ చరిత్ర చెబుతుంది. శ్రీరాముడు తన తండ్రికి ఇచ్చిన మాట ప్రకారం వనవాసానికి అడవులకు వెళ్తుండగా మార్గ మధ్యలో సీతారాములు శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజించినట్లు ఆనవాలు చెబుతున్నాయి. ప్రతి శివాలయంలో లింగానికి అడ్డబొట్టు ఉంటే ఇక్కడ



శివరాత్రి వేడుకలకు సిద్ధంగా ఉన్న శ్రీరామలింగేశ్వరుడు ఆలయం

మాత్రం రామలింగం(నిలువు నామం) ఉంటుంది. ప్రతి అమవాస్యకు పూజలు, భక్తులకు అన్నదానం నిర్వహిస్తారు.

ఏటా పెరుగుతున్న శివమాలధారులు..

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని 41 రోజుల ముందు భక్తులు శివమాలధారులు చేపడతారు. మండలంలో ఏటా శివమాలధారులు పెరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో శివదీక్ష..



శివమాల వేస్తే నిత్యం శివ నామస్మరణతో మనశాంతి ఉంటుంది. శివరాత్రికి ముందు వచ్చే ప్రతి పౌర్ణమి శ్రీశైలం మల్లికార్జున భ్రమరాంభ అమ్మవారి ఆశీస్సులతో శివ మాలవేసుకుని నిత్యం శివపూజ చేసి ఆరాధిస్తున్నాం. అందువల్ల అన్ని శుభాలే జరుగుతున్నాయి.

– వర్కూర్ ఆంజనేయులు, శివమాలధారుడు, మాగనూర్

అన్ని ఏర్పాట్లు పూర్తి..



ఆలయంలో ఆదివారం జరగాల్సిన పూజ కార్యక్రమాలకు గ్రామపెద్దలు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు. శనివారం రాత్రి మొత్తం పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి జాగరణతో పాటు భజన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

– కృష్ణయ్య, మాగనూర్

ఇక్కడ ఘనంగా వేడుకలు



మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వరుడి ఆలయం ఎంతో చరిత్ర కలిగి ఉంది. స్వయాన శ్రీరామచంద్రుడు ఇక్కడ శివలింగం ప్రతిష్ఠించి పూజలు చేయడంతో నిత్యం పంటలు పుష్కలంగా పండుతాయి. ప్రతి సంవత్సరం శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహిస్తుంటాం.

– జంగం ప్రవీణ్‌కుమార్, ఆలయ ప్రధాన పూజారి

రైతులు ఆందోళన చెందవద్దు

మక్తల్: రబీ సీజన్‌లో సంగంబండ, భూత్పూర్ రిజర్వాయర్ల నుంచి వరి పంటలకు సాగునీరు అందిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మక్తల్ మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, మక్తల్ మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని చిన్నగోప్లాపూర్ పంపుహౌజ్ దగ్గర మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు రెండు రిజర్వాయర్లకు నీటిని విడుదల చేశారు. కృష్ణా నదిల్లో నీటి మట్టం తక్కువ కావడంతో మోటార్లకు నీటిని లెవలింగ్ సరిపడకపోవడంతో కర్ణాటక ప్రభుత్వంతో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అక్కడికి వెళ్లి మాట్లాడారు. కర్ణాటక సీఎం సిద్దరామయ్య, ఉపముఖ్య మంత్రి శివకుమార్, నీటిపారుదల శాఖ మంత్రి బోసురాజులతో మాట్లాడి 4టీఎంసీలను నీటిని విడుదల చేసేందుకు చర్యలు తీసుకున్నారు. సానుకూలంగా స్పందించి కృష్ణానదికి రెండు రోజుల క్రితం 6వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మంగళవారం మోటార్లకు లెవలింగ్ నీరు రావడంతో మోటార్లను ఆన్ చేశారు. దీంతో రబీలో సాగు చేసిన రైతులు ఆనందం వ్యక్తం చేశారు. చిన్నగోప్లాపూర్ పంప్‌హౌజ్ నుంచి 650 క్యూసెక్కుల సామర్థ్యంతో ఒక పంపు ఆన్ చేశారు. 250 క్యూసెక్కులు భూత్పూర్ రిజర్వాయర్‌కు, మిగిలిన 400 క్యూసెక్కులను సంగంబండ రిజర్వాయర్‌కు విడుదల చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు చంద్రకాంత్‌గౌడ్, హన్మంతు, ఈఓ నాగశివ, కట్టసురేష్, కావలి శ్రీహరి, కోళ్ల వెంకటేష్, వెంకటయ్య, రాయికోడ్ ఆనంద్, సురేష్, ఆతయప్ప, షాలం, రైతులు పాల్గొన్నారు.



చిన్నగోప్లాపూర్ దగ్గర పంపుహౌజ్‌లో మోటార్‌ను ఆన్ చేస్తున్న డీఈ వెంకటరమణ

విద్యాభివృద్ధికి సహకరించాలి

మాగనూర్: మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సహకారం అందించాలని మండల ఇన్‌చార్జి ఎంఈఓ అనిల్‌కుమార్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని ఓబ్లాపూర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు తరగతి గదులు తక్కువ అవుతున్నందున పాఠశాలలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని మరో చోటుకు మార్చుకోవాలని అంగన్‌వాడీ టీచర్‌కు సూచించారు. ఇప్పటికే గ్రామస్తులు ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, సీఆర్పీ కృష్ణయ్య, గ్రామ మాజీ సర్పంచ్ నారాయణ పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంఈఓ అనిల్‌కుమార్‌గౌడ్

ప్రైవేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

నారాయణపేట ఎడ్యుకేషన్: అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి సాయికుమార్ అన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సుదర్శన్‌రావ్‌కు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. చట్ట విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు, అధిక ఫీజులు వసూలు చేస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్, జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్, జిల్లా కోశాధికారి మహేష్, జిల్లా నాయకులు సురేష్, అనిత, గణేష్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రాక్టిసింగ్ హైస్కూల్, వైదిక ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి అజయ్ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని వాపోయారు. ఆహారం విషయంలో నాణ్యత పాటించడం లేదని, పాఠశాలలో తాగు నీటి సమస్య, తరగతి గదుల సమస్య, ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందన్నారు. ప్రాక్టిసింగ్ హైస్కూల్‌లో సొంత భవనం లేక రేకుల షెడ్డులో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఉపాధ్యక్షుడు గౌస్, నాయకులు మహిపాల్, సురేష్, సాగర్, గణేష్ పాల్గొన్నారు.



డీఐఈఓకు వినతి పత్రం అందిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

రహదారి ఛిద్రం

నర్వ: యాంకీ నుంచి పెద్దకడ్మూర్ వరకు ఉన్న బీటీ రహదారి పూర్తిగా ఛిద్రమై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కల్గిస్తోంది. కొన్ని రోజులుగా ఈ రహదారి అడుగడుగునా గోతులుపడి పూర్తిగా దెబ్బతినిందని వాహనదారులు వాపోతున్నారు. కనీసం మరమ్మతుకు కూడా నోచుకోకపోవడంతో నిత్యం ఈ మార్గంలో మండల కేంద్రానికి, గద్వాల్‌కు వెళ్లే వాహనదారులు, బైక్ రైడర్స్ నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ అధికారులు క్షేత్రస్థాయిలో రహదారిని పరిశీలించి మరమ్మతు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



ఛిద్రమైన యాంకీ, పెద్దకడ్మూర్‌కు వెళ్లే రహదారి

బాలికలు అన్నిరంగాల్లో రాణించాలి



దామరగిద్ద: బాలికలు ఉన్నత చదువులు చదివి అన్ని రంగాల్లో రాణించాలని ఎంఈఓ, జీఎహెచ్‌ఎం కృష్ణారెడ్డి, ఉపాధ్యాయురాలు నవ్యశ్రీ అన్నారు. మంగళవారం మండలంలోని మొగుల్‌మడ్క జెడ్పీఉన్నత పాఠశాలలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో 'బేటీ బచావో– బేటీ పడావో' కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నవ్యశ్రీ, ప్రకాష్, బనదయ్య, శ్రీధర్, అంజిలయ్య, భాగ్యమ్మ, మోహన్‌రెడ్డి, మల్లికార్జున్, అంజిలప్ప, వేణుగోపాల్ సంస్థ ప్రతినిధులు విద్యార్థులు పాల్గొన్నారు.

'కుంభం శివకుమార్‌రెడ్డికి ఎమ్మెల్సీ సీటు ఇవ్వాలి'

దామరగిద్ద: సీనియర్ నాయకుడు, డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డికి రానున్న ఎమ్మెల్యే కోట ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని మండల కాంగ్రెస్ నాయకులు మాజీ ఉప సర్పంచ్ లక్ష్మణ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌లు ఒక ప్రకటనలో కోరారు. సుదీర్ఘంగా రాజకీయాల్లో ఉంటూ పదవులను ఆశించకుండా ప్రజా సేవ చేసిన నాయకుడని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి శివకుమార్‌రెడ్డి సేవలను గుర్తించి శాసనసభ్యుల కోటలో ఎమ్మెల్సీగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు.

బీజేపీని బలోపేతం చేయాలి

నారాయణపేట రూరల్: నాయకులు, కార్యకర్తలు అందరం కలిసి బీజేపీని బలోపేతం చేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు దక్కించుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్ అన్నారు. బీజేపీ నూతన అధ్యక్షుడిగా ఇటీవల ప్రకటించిన నేపథ్యంలో మంగళవారం ఆయనను నాయకులు శాలువాలు, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదుతో పాటు బూత్ కమిటీల ఏర్పాటులో కార్యకర్తలు ఎంతో సమర్థవంతంగా కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందు నామాజీ, జిల్లా కోశాధికారి వెంకట్ రాములు, పట్టణ అధ్యక్షుడు పోషల్ వినోద్, వెంకటయ్య, రాము, హన్మంతు, శ్రీనివాస్రెడ్డి, దత్తు, సంతోష్, బాబు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

నర్వ: మండలంలోని పాథర్చేడ్ ప్రధాన రహదారిపై బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ఊట్కూర్ మండలానికి చెందిన తాయప్ప బైక్‌పై వెళ్తుండగా, పాథర్చేడ్ చెరువు కట్ట సమీపంలో బైక్ అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొన్నాడు. ఈ సంఘటనలో అతనికి తీవ్ర గాయాలుకాగా, అటు వైపు వెళ్తున్న వారు పోలీసులకు, 108కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పీసీ రఘు, 108 వాహనంలో గాయపడ్డ వ్యక్తిని మక్తల్ ఆస్పత్రికి తరలించడంలో సహాయపడ్డారు.

భక్తిశ్రద్ధలతో మల్లికార్జునుడి హోమం

కొత్తపల్లి: మండల కేంద్రంలో మల్లికార్జునస్వామి ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నా యి. మూడు రోజుల పాటు కొనసాగే కిర్యక్రమంలో బాగంగా మంగళవారం ప్రధాన అర్చకులు రా మాచార్యుల బృందంతో హోమం నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణ బట్ల, అమర జ్యోషి, అనిల్ కు మార్ జ్యోషి, శ్రీకాంత్ చారి, రవికుమార్ జ్యోషిల తో కార్యక్రమాలు కొనసాగించారు. విగ్రహమూర్తులకు ధ్వజ స్తంభం, నవగ్రహాల ప్రతిష్ఠ ఉంటాయని తెలిపారు. కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు.



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా ఎల్లమ్మ జాతర

నారాయణపేట రూరల్: జిల్లాలోనే అత్యంత ప్రత్యేకత కలిగిన లింగంపల్లిలో మూడో మంగళవారం ఎల్లమ్మతల్లి జాతర భక్తులతో జనసంద్రంగా మరింది. అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ పరిసరాల్లో కొత్త కుండలో ఉడకపెట్టిన అన్నం, వంకాయ, ఉలిగడ్డ కూరలతో నైవేద్యం సమర్పించారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఎల్లమ్మఆలయం చుట్టూ భక్తుల ప్రదక్షిణలు

పల్లెర్లలో ఏఐ ఆధారిత తరగతులు ప్రారంభం

మద్దూరు: మండలంలోని పల్లెర్ల ప్రాథమిక పాఠశాలలో ఏఐ ఆధారిత బోధనను మంగళవారం అధికారులు ప్రారంభించారు. జిల్లాలో ప్రాథమిక స్థాయిలో 4, 5 తరగతుల విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించాలనే ఉద్దేశంతో 10 పాఠశాలలను ఎంపిక చేశారు. అందులో పల్లెర్ల పీఎస్ ఒకటి అని పాఠశాల హెచ్‌ఎం పావని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ లక్ష్మి, ఉపాధ్యాయులు హరిచందన్, ప్రణీత, సుదర్శన్‌రెడ్డి, సాయికుమార్ పాల్గొన్నారు.



పల్లెర్లలో ఏఐ ఆధారిత తరగతి ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు

నెట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ధన్వాడ: జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు మండలంలోని కొండాపూర్ గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజారాం, పీడీ కోచ్ డాక్టర్ రామ్మోహన్‌గౌడ్ తెలిపారు. హర్యానా నెట్‌బాల్ సంఘం, జాతీయ నెట్‌బాల్ క్రీడ సమైక్య సంయుక్తంగా ఈ నెల 26 నుంచి 28 వరకు హర్యానలో నిర్వహించే జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు తెలంగాణ జట్టు తరపున రాకేష్, బాలరాజు ఎంపికైనట్లు తెలిపారు. 1 నుంచి 3వ తేదీ వరకు నిర్వహించే 1వ జూనియర్ మిక్స్‌డ్ జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు త్రిశాంత్, హరీష్‌లు ఎంపికైట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సాంబయ్యానాయక్, ఉపాధ్యాయులు అభినందించారు.



ఎంపికైన విద్యార్థులు

సైక్లింగ్ క్రీడాకారిణికి సన్మానం

ఊట్కూరు: మండలంలోని చిన్నపొర్ల గ్రామానికి చెందిన సైక్లింగ్ క్రీడాకారిణి గాయత్రికి మంగళవారం సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలం ఘనంగా సన్మానించారు. వారం రోజుల క్రితం జిల్లా స్థాయి మౌంటేన్ సైక్లింగ్ పోటీలలో గాయత్రి జిల్లా పోటీలలో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. క్రీడాకారిని నారాయణపేటలోని నర్సిరెడ్డి హిందీ కళాశాలలో బీకాం చదువుతోంది. మార్చి 7న హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే రాష్ట్ర స్థాయి మౌంటేన్ సైక్లింగ్ పోటీలలో పాల్గొననుంది. కార్యక్రమంలో రాజు, శంకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారిణిని సన్మానిస్తున్న సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలం

కందుల కొనుగోలు చేపట్టండి

నర్వ: గ్రామాల్లో కంది రైతుల నుంచి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి పూర్తిస్థాయిలో చేపట్టాలని కంది రైతులు కోరుతున్నారు. గ్రామాల వారీగా కేటాయించిన కొనుగోలు కేంద్రాలకు సిబ్బంది వచ్చి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడంతో పాటు లారీలను కేటాయించి తరలించే ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. లారీలు రాకపోవడంతో ప్రైవేటు మార్కెట్‌కు విక్రయించి తీవ్రంగా నష్టపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైన అవగాహన కల్పించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామాల వారీగా కేటాయించిన కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కంది ధాన్యం కొనుగోలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

సీపీఎస్ యుద్ధభేరి పోస్టర్ ఆవిష్కరణ



సీపీఎస్ యుద్ధభేరి పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

కోస్గి: నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని టీఎస్‌సీపీఎస్ ఈయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు మహేష్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎంపీడీఓ, తహసీల్దార్, ఎంఈఓ కార్యాలయాల ముందు సీపీఎస్ యుద్ధభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపీఎస్ సాధించే దిశగా సమరశంఖం పూరించాలని, ఉద్యోగులంతా సంఘాలకు అతీతంగా మార్చి 2న హైదరాబాద్‌లో ధర్నాచౌక్‌కు తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ శంకర్‌నాయక్, టీఎస్‌సీపీఎస్ ఈయూ జిల్లా కోశాధికారి రాజేందర్‌రెడ్డి, మండల బాధ్యులు అర్జున్, శ్రీకాంత్, రాజేంద్రబాబు, ఆంజనేయులు, కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎల్‌ఓసీ అందజేత

మద్దూరు: మండలంలోని మోమినాపూర్ గ్రామానికి చెందిన మ్యాకల భీములు కిడ్నీ సమస్యతో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో వైద్య ఖర్చుల నిమిత్తం రూ.2.75 లక్షల ఎల్‌ఓసీని మంగళవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రవికుమార్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



బాధితురాలికి ఎల్‌ఓసీ అందజేస్తున్న తిరుపతిరెడ్డి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

నారాయణపేట	జి. వెంకటేష్ గౌడ్	- 96666 52077
మక్తల్	మహేష్	- 83099 46853
కోస్గి	కె. రమేష్	- 99486 98552

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండంత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు:

యాడ్స్ మేనేజర్ 9951602829 జావిద్: 90109 62007